సాక్షి అనకాపల్లి
గురువారం । 10 । జూలై । 2025




చల్లగ చూడు స్వామీ..




రథాన్ని ప్రారంభిస్తున్న అశోక్‌గజపతిరాజు

అడుగులో అడుగేస్తూ.. అప్పన్నను స్మరిస్తూ..



- గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు
- ఉదయం 6 గంటల నుంచే ప్రదక్షిణ ప్రారంభించిన భక్తులు
- మధ్యాహ్నం 2 గంటలకు పుష్పరథం ప్రారంభం

సింహాచలం: ఆషాఢ చతుర్దశిని పురస్కరించుకుని బుధవారం సింహగిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణలో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఉదయం 6 గంటల నుంచే చేరుకున్న భక్తులు కొండదిగువ తొలిపావంచా వద్ద కొబ్బరికాయ కొట్టి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. ఈసారి కూడా అధిక సంఖ్యలో యువత గిరి ప్రదక్షిణ చేశారు. తొలిపావంచా వద్ద ప్రారంభమైన భక్తుల గిరి ప్రదక్షిణ అడవివరం, పైనాపిల్‌కాలనీ, సెంట్రల్ జైలు, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు, అప్పుఘర్, ఎంవీపీకాలనీ, సీతమ్మధార, నరసింహనగర్, డీఎల్‌బీ క్వార్టర్స్, కప్పరాడ, మురళీనగర్, మాధవధార, ఆర్‌అండ్‌బీ కార్యాలయం, లక్ష్మీనగర్, కుమారి కల్యాణమండపం, ప్రహ్లాదపురం మీదుగా సింహాచలం చేరుకోవడంతో ముగిసింది.

వైభవంగా రథయాత్ర

కొండదిగువ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి తొలి పావంచా వద్ద బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు రథంలో ఉన్న స్వామికి పూజలు నిర్వహించారు.



తొలిపావంచా వద్ద కిటకిటలాడిన భక్తజనం

అనంతరం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు జెండా ఊపి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆ సమయానికి తొలిపావంచా వద్దకు చేరుకున్న లక్షలాది మంది భక్తులు స్వామి నామస్మరణ చేస్తూ రథాన్ని అనుసరించారు. తొలిపావంచా నుంచి ప్రారంభమైన రథయాత్ర అడవివరం, పైనాపిల్‌కాలనీ, సెంట్రల్ జైల్, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటిపార్కు, అప్పుఘర్, ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం, సత్యం జంక్షన్, ఎన్ఏడీ కొత్తరోడ్డు, గోపాలపట్నం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకుంది. రథోత్సవం ప్రారంభోత్సవంలో ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గణబాబు తదితరులు పాల్గొన్నారు. రథోత్సవంలో పులివేషాలు, తప్పెటగుళ్లు, కేరళ డ్రమ్స్, కాళీ వేషాలు విశేషంగా అలరించాయి.

స్వచ్ఛంద సంస్థల సాయం

గిరి ప్రదక్షిణని పురస్కరించుకుని కలెక్టర్ హరేందిర ప్రసాద్, దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. గిరిప్రదక్షిణ జరిగే 32 కిలోమీటర్ల కొండచుట్టూ 30



కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

ప్రదేశాల్లో భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు స్టాల్స్ ఏర్పాటు చేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 32 చోట్ల వైద్య శిబిరాలు, 18 అంబులెన్సులు, రెండు సూపర్ స్పెషాల్టీ వైద్య బృందాలు అందుబాటులో ఉంచి భక్తులకు వైద్య సేవలు, మందులు అందజేశారు. జీవీఎంసీ 109 ప్రదేశాల్లో 400 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసింది. గిరి ప్రదక్షిణ జరిగే ప్రాంతంలో తాగునీరు అందుబాటులో ఉంచింది. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దారిపొడవునా స్వచ్ఛంద సంస్థలు భక్తులకు ఆహార పదార్థాలు, స్నాక్స్, పానీయాలు అందజేశాయి.

32 కి.మీ కాదు.. 44 కి.మీ. నడిచారు

వీఐపీ, వీవీఐపీ వారిపై ఉన్న శ్రద్ధ సామాన్య భక్తులపై లేదంటూ పోలీసులపై, ప్రభుత్వంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఐపీలకు నేరుగా తొలి పావంచా వద్దకు అనుమతించి.. సామాన్య భక్తుల వాహనాలను మాత్రం ఐదారు కిలోమీటర్ల దూరంలోనే నిలిపివేశారు. దీంతో తొలిపావంచా వరకు నడిచి.. అక్కడి నుంచి 32 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేసి.. మళ్లీ వాహనాల కోసం ఐదారు కిలోమీటర్లు నడిచి.. వాహనాల వద్దకు చేరుకోవాల్సి వచ్చింది. దీంతో దాదాపు 44 కిలోమీటర్లకు వరకు భక్తులు నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



సమతా కాలేజ్ వద్ద భక్తుల రద్దీ



పులివేషాలు



తప్పెటగుళ్లు

మెడికల్ క్యాంపుల ఏర్పాటు



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

మహారాణిపేట: గిరి ప్రదక్షిణ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో మొత్తం 32 పాయింట్లలో మెడికల్ క్యాంపులను నిర్వహించారు. అవసరమైన 23 ప్రాంతాల్లో అంబులెన్సులను సిద్ధం చేశారు.

అప్పుఘర్ తీరంలో పుణ్యస్నానాలు



సముద్రస్నానం చేస్తున్న భక్తులు

ఎంవీపీకాలనీ : గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులతో అప్పుఘర్ తీరం పొటెత్తింది. భక్తుల పుణ్య స్నానాలతో తీరం కిటకిటలాడింది. పోలీసు సిబ్బంది, గజ ఈతగాళ్లు నిత్యం భక్తులను అప్రమత్తం చేశారు. తీరంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. డ్రెసింగ్ రూమ్‌లు, మొబైల్ టాయిలెట్లు అందుబాటులో ఉంచారు.

జాడలేని వరుణుడు



ఎండఎక్కువగా ఉండటంతో గొడుగులు వేసుకుని ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

పెందుర్తి: ఏటా ఆషాఢ చతుర్దశి నాడు 'గోవింద'నామస్మరణతో గిరి చుట్టూ తిరిగే సింహాద్రి అప్పన్న భక్తులను వరుణుడు పలకరించడం పరిపాటి. ఎంతలా అంటే గిరి ప్రదక్షిణ రోజు తప్పకుండా వర్షం పడుతుంది అన్నంతగా భక్తుల్లో నాటుకుపోయింది. కానీ ఈ ఏడాది భక్తులకు వరుణుడు మొహం చాటేశాడు. బుధవారం ఉదయం నుంచీ భానుడు నిప్పులు కురిపించాడు. దాదాపు 30 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రతతో భక్తులు ఆపసోపాలు పడ్డారు. అయితే ప్రతీ ఏడాది లాగే సాయంత్రానికి వర్షం పడుతుందన్న ఆశతో ఎదురుచూసిన భక్తులకు నిరాశే ఎదురైంది. రోజంతా చుక్క వాన కాదు కదా కనీసం ఎక్కడా మేఘావృతం కూడా కనిపించలేదు.

సౌకర్యాలపై జీవీఎంసీ కమిషనర్ ఆరా



స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

అల్లిపురం: గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు అందుతున్న సౌకర్యాలను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పర్యవేక్షించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సిటీ ఆపరేషన్స్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను బుధవారం అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, పర్యవేక్షక ఇంజినీర్లు పీవీ సత్యనారాయణ రాజు, గోవిందరావులతో కలసి పరిశీలించారు. నడక మార్గంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు హెల్ప్‌లైన్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ఆరా తీశారు. లుంబినీ పార్కు, వెంకోజీపాలెం వద్ద ఏర్పాటు చేసిన తాగునీటి పాయింట్లను సందర్శించారు. ప్రసాద వితరణ చేపడుతున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను శుభ్రం చేయాలని పారిశుధ్య కార్మికులను ఆదేశించారు.

సైడ్ లైట్స్



తొలిపావంచా వద్దరోడ్డుపైనే కొబ్బరికాయలు కొట్టడంతో ఏర్పడిన పెద్ద కుప్ప

- గిరి ప్రదక్షిణ ప్రారంభించేందుకు ఉదయం 6 గంటల నుంచే భక్తులు సింహాచలం చేరుకున్నారు. ఉదయం 11 గంటల నుంచి ఒక్కసారిగా రద్దీ పెరిగింది. మధ్యాహ్నం రెండు గంటలకు రథోత్సవం ప్రారంభం సమయానికి తొలిపావంచా నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు ఇసుకేస్తే రాలనంతగా భక్తులు బీఆర్‌టీఎస్ రోడ్డులో కిక్కిరిశారు.
- ఉదయం 6 గంటలకే గిరి ప్రదక్షిణ ప్రారంభించిన పలువురు భక్తులు సాయంత్రానికే తిరిగి సింహాచలం చేరుకున్నారు. వారందరికీ రాత్రి 9 గంటల వరకు స్వామి దర్శనాలు అందజేశారు.
- తొలిపావంచా వద్దకు వెళ్లలేని భక్తులు రోడ్ల పైన, బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకుని ఏర్పాటుచేసిన గోడపైన కొబ్బరికాయలు కొట్టారు. దీంతో తొలిపావంచా వద్ద రోడ్డుపైనే కొబ్బరికాయచెక్కల కుప్ప పెద్ద ఎత్తున ఏర్పడింది.
- భక్తులు కొట్టిన కొబ్బరి చెక్కలు తరలించేందుకు క్రేనులు, లారీలు ఏర్పాటు చేశారు.
- దేవస్థానం బస్టాండ్‌లో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. అయినా తప్పిపోయిన వాళ్ల బంధువులు అక్కడికి వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు.
- తొలిపావంచా ఎదురుగా మధ్యాహ్నం నుంచి కొండపైకి వెళ్లే ఆర్టీసీ బస్సులు పెద్ద ఎత్తున నిలపడంతో.. అక్కడకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
- పారిశుధ్య నిర్వాహణలో జీవీఎంసీ దారుణంగా విఫలమైంది. భక్తుల రద్దీ తక్కువగా ఉన్నప్పుడు కొద్దిపాటి చెత్తను ఎప్పటికప్పుడు ఎత్తిన జీవీఎంసీ సిబ్బంది.. సాయంత్రం భక్తుల రద్దీ పెరిగేసరికి చేతులెత్తేశారు. మేయర్, అధికారుల పర్యవేక్షణ లోపంతో ఎక్కడిక్కడే చెత్త పేరుకుపోయింది.
- 32 కిలోమీటర్లతో పాటు ట్రాఫిక్ ఆంక్షల కారణంగా మరో పది కిలో మీటర్లు అదనంగా నడిచిన భక్తులు ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడ్డారు.
- గిరి ప్రదక్షిణలో మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు పిల్లలు తప్పిపోకుండా వారి చేతులకు ఏఐ ట్యాగ్‌లు వేశారు. గత ప్రభుత్వం హయాంలో ఈ విధానాన్ని అమలు చేయగా, ఈ ఏడాది కూడా అధికారులు కొనసాగించారు.

చోరుల చేతివాటం

గిరి ప్రదక్షిణ వేళ చోరులు చేతివాటం ప్రదర్శించారు. సింహచలం తొలి పావంచ మొదలుకొని అడవివరం, ఆరిలోవ, హనుమంతవాక, నగరంలో పలు చోట్ల మహిళల మెడలో బంగారు ఆభరణాలతో పాటు సెల్‌ఫోన్లు, నగదు దొంగిలించినట్లు ఆయా ప్రాంతాల్లోని పోలీసులకు బాధితులు ఫిర్యాదులు చేశారు.



హనుమంతవాక వద్ద రథం

రైతుల పక్షాన ప్రశ్నిస్తే అడ్డంకులు సృష్టించడం దారుణం

- వైఎస్ జగన్ పర్యటిస్తే కూటమి ప్రభుత్వానికి భయమెందుకు ?
- పోలీసులను అడ్డం పెట్టుకొని ఆటంకాలు సృష్టించడం సిగ్గుచేటు
- కూటమి పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ
- మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ధ్వజం



దేవరాపల్లి: రైతుల పక్షాన నిలబడి ప్రశ్నిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్న మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి పర్యటనలకు అడ్డంకులు సృష్టించడం దారుణమని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. దేవరాపల్లి మండలం తారువలో బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో మామిడి రైతుల కష్టాలను తెలుసుకునేందుకు వెళ్లిన వైఎస్ జగన్‌కు అడుగడుగునా ఆటంకాలు సృష్టించడం సిగ్గుచేటన్నారు. గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోలేని చంద్రబాబు ప్రభుత్వం..రైతు సమస్యలపై ప్రశ్నించేవారి గొంతును నొక్కాలని చూడటం సమంజసం కాదని తీవ్రంగా మండిపడ్డారు. జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు రైతులు, ప్రజలు, కార్యకర్తలు రాకుండా పోలీసులు చెక్ పోస్టులను పెట్టి అడ్డుకోవడంతో పాటు నోటీసులు జారీ చేసి, రౌడీ షీట్లు తెరుస్తామంటూ భయానక పరిస్థితులు సృష్టించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. వరి, మిర్చి, పొగాకు రైతులు గిట్టుబాటు ధర లేక దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను పరామర్శించేందుకు పర్యటిస్తున్న వైఎస్ జగన్‌కు వస్తున్న జనాదరణ చూసి జీర్ణించుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ఈ నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని అవాంతరాలు సృష్టిస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, ప్రతిపక్ష నాయకుడిగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించుకునే పరిస్థితి లేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనలను అడ్డుకోవడంపై పెట్టిన శ్రద్ధను రైతు సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం పెడితే బాగుండేదన్నారు. రైతులపై దాడులు చేసి అవమానకరంగా మాట్లాడటం మంచిపద్ధతి కాదని, వెంటనే రైతులకు క్షమాపణ చెప్పాలని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు డిమాండ్ చేశారు.

గురువులపై 'మెగా' భారం

పాఠశాలల్లో 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్' నిర్వహణ ఉపాధ్యాయులకు భారంగా మారింది. సమావేశాల కోసం కనీసం రూ.7 వేల నుంచి రూ.30 వేల వరకు పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టీ ఖర్చవుతుందని అంచనా. అయితే ఇందుకు సంబంధించిన నిధులను ప్రభుత్వం అరకొరగా విడుదల చేయడంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో చాలా మంది ఉపాధ్యాయుల బ్యాంకు ఖాతాలో బుధవారం వరకు కూడా నగదు జమ కాలేదు. మీటింగ్ నిర్వహణకు డబ్బులు ఎక్కడి నుంచి తేవాలంటూ వారు తలలు పట్టుకుంటున్నారు.

- మెగా పేరెంట్స్- టీచర్స్ మీటింగ్ నిర్వహణకు నిధుల కొరత
- ఆర్భాటంగా నిర్వహించాలని ఆదేశాలు
- ఉపాధ్యాయులకు వదిలిన చేతి చమురు
- ప్రభుత్వ గొప్పల కోసం టీచర్లపై భారం
- అరకొర నిధులు.. హెచ్‌ఎంల జేబుకు చిల్లు!

అనకాపల్లి టౌన్: గిన్నిస్ బుక్‌ఆఫ్ రికార్డు కోసం రాష్ట్ర ప్రభుత్వం పడుతున్న తాపత్రయం గురువులు, విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ఇటీవల యోగాంధ్ర పేరిట నిర్వహించిన కార్యక్రమంలో పడిన కష్టాలను మరవకముందే గురువుల నెత్తిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ పేరిట ప్రభుత్వం మరో భారాన్ని మోపింది. ఇందుకోసం కేటాయించిన అరకొర నిధులు కూడా ఇంతవరకు పలువురు హెచ్‌ఎంల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. దీంతో చేతి చమురు వదిలించుకోవాల్సిన పరిస్థితి వస్తోందని హెచ్‌ఎంలు లోలోపల మదనపడుతున్నారు. గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) నిర్వహించాల్సి ఉంది. కష్టపడి మీటింగ్ ఏర్పాటు చేయడంతోపాటు చేతి డబ్బులు కూడా ఖర్చు చేయాలా అంటూ హెచ్‌ఎంలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు సమాచారం. ప్రతి పాఠశాల, కళాశాలల్లో తల్లిదండ్రుల సమావేశాల నిర్వహణకు రూ.7 వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చు అవుతుంది. సమావేశాలకు వచ్చే తల్లిదండ్రులు, వారి పిల్లలకు మాంసాహారంతో కూడిన భోజనం అందించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఉదయం స్నాక్స్,టీ, వాటర్ బాటిళ్లు కూడా పంపిణీ చేయాల్సి ఉంది. వీటన్నింటిని ఉపాధ్యాయ వర్గాలు కొనుగోలు చేశాయి. అలాగే టెంట్లు, కుర్చీలను కూడా అద్దెకు తెచ్చుకుంటున్నారు. ఖర్చులు అధికంగా ఉంటుండడంతో ఆ సొమ్మంతటిని ప్రభుత్వం చెల్లించకపోతే ఆర్థికంగా నష్టపోతామని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఈ విషయం అధికారుల వద్ద చెప్పుకున్నా ఫలితం ఉండదని, వారిలో వారే గుసగుసలాడుకుంటున్నారు.

జిల్లాలో 2,11,781 మంది విద్యార్థులు

జిల్లాలో 2,232 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 1,87,000 మంది విద్యార్థులు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్, మున్సిపల్, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ పాఠశాలలు తదితర వాటితో పాటు ప్రైవేట్, అన్ ఎయిడెడ్ సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ పాఠశాలలున్నాయి. అలాగే 134 జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో 24,781 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటన్నింటిలోనూ పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించాలి. తల్లిదండ్రులను సంతోషపెట్టే విధంగా ఉపాధ్యాయులు మెలగాలి. ఈ మేరకు కార్యక్రమ నిర్వహణకు హెచ్‌ఎంలు సిద్ధమయ్యారు.

మౌలిక సౌకర్యాలను పక్కనబెట్టి..

మెగా పేరెంట్స్- టీచర్స్ మీటింగ్ ఇటు ఉపాధ్యాయులు అటు తల్లిదండ్రులకు తలనొప్పి తెస్తోంది. బడులు తెరిచి నెల రోజులు కావస్తున్నా ఏ పాఠశాలలో కూడా పూర్తిస్థాయిలో యూనిఫామ్, షూస్, బెల్ట్‌లు, పుస్తకాలు అందించలేదు. కొద్ది మందికి మాత్రమే యూనిఫామ్స్ అందజేసి ప్రభుత్వం చేతులు దులుపుకొంది. దీంతో తల్లిదండ్రుల నుంచి ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా చేరిన విద్యార్థులకు ప్రభుత్వం మొండి చెయ్యి చూపించింది. ఇప్పటికే వివిధ కారణాలతో తల్లికి వందనం ఆపేయడంతో తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.



కోడూరు పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న స్వాగత ద్వారం

చదువులకు దూరం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత చదువు కన్నా ప్రచార ఆర్భాటాల కార్యక్రమాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. మొన్న యోగాంధ్ర పేరుతో వారం రోజుల పాటు చదువులకు దూరమయ్యారని, ఇప్పుడు పనికి రాని మీటింగ్‌లతో వారం రోజుల పాటు చదువులు చెప్ప లేదని వారు వాపోతున్నారు. ఈ మెగా కార్యక్రమం కేవలం ప్రచార ఆర్భాటానికే పనికి వస్తుందని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

హైడ్రోపవర్ ప్రాజెక్టులు వద్దేవద్దు

- గిరిజనులకు చాలా నష్టం
- తక్షణమే సర్వే నిలిపివేసి, అనుమతులు రద్దు చేయాలి
- పలువురు సభ్యుల డిమాండ్
- ఉమ్మడి విశాఖ జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్లకార్డులతో నిరసన


సమావేశంలో మాట్లాడుతున్న, చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వేదికపై కలెక్టర్లు హరేంధిర ప్రసాద్, దినేష్‌కుమార్, విజయ్‌కృష్ణన్


హైడ్రోపవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలని ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ, సీపీఎం సభ్యులు

మహారాణిపేట (విశాఖ): అనంతగిరి మండలం గుజ్జలి, చిట్టంవలసలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ల నిర్మాణం వల్ల ఏజెన్సీ ప్రాంతానికి ముప్పు నెలకొనడమే కాకుండా పర్యావరణం, రైతులకు నష్టం జరగనున్న దృష్ట్యా ప్రాజెక్టుల సర్వే నిలిపివేసి, అనుమతులను తక్షణమే రద్దు చేయాలని తీర్మానించారు. బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతగిరి జెడ్పీటీసీ (సీపీఎం) డి.గంగరాజు మాట్లాడుతూ ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ల నిర్మాణం చట్ట విరుద్ధమన్నారు. వీటివల్ల చాలా నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు గిరిజన చట్టాలను ఉల్లంఘించడంతోపాటు 1/70 చట్టానికి తూట్లు పొడుస్తున్నారని చెప్పారు. ప్రాజెక్ట్‌ల ఏర్పాటుపై బుధవారం నిర్వహించిన గ్రామసభలపై తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. ఈ ప్రాజెక్ట్ వల్ల అనకాపల్లి జిల్లా రైవాడ జలాశయం నీరు కూడా కలుషితం అవుమవుతుందని, దీనివల్ల ఇటు రైతులు అటు విశాఖ నగరానికి తాగునీటికి ఇబ్బందులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్‌ల వల్ల గిరిజనులకు ఎంతోనష్టం జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్ట్ రద్దు చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కోరారు. దీనిపై ఏఎస్సార్ జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ అన్ని విషయాలు పరిగణనలోకి తీసుకొని గ్రామ సభలు నిర్వహించి, తీర్మానాలు చేసిన తరువాత మాత్రమే ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ల నిర్మాణం విరమించాలని ప్లకార్డులతో పలువురు సభ్యులు నిరసన తెలిపారు. ఉచిత విత్తనాలు అందించాలని, రైతు భరోసాకు సంబంధించి రైతుల సంఖ్య గతంలో కన్నా ఇప్పుడు తగ్గడానికి కారణాలు తెలియజేయాలని పలువురు సభ్యులు కోరారు.

రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

అచ్యుతాపురం జెడ్పీటీసీ లాలం రాంబాబు, కోఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ మాట్లాడుతూ అనకాపల్లి – అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులు సంవత్సరాల తరబడి జరుగుతున్నాయని, దీనివల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ పనులు వెంటనే పూర్తి చేసేందుకు కలెక్టరు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే చెప్పిన పనులే కాకుండా ప్రజల అవసరాలను కూడా అధికారులు పట్టించుకోవాలన్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ మాట్లాడుతూ స్వయంగా పనులను పర్యవేక్షించి త్వరలో పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు.

కేజీహెచ్‌లో సరిగా అందని వైద్య సేవలు

గిరిజనులకు కేజీహెచ్‌లో సరైన వైద్యం అందడం లేదని, ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.లక్షలు వసూలు చేస్తున్నారని అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి వివరాలు అందజేస్తేవిచారణ చేస్తామని విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌హరేంధిర ప్రసాద్ చెప్పారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, గిరిజన ప్రాంతాల నుంచి కేజీహెచ్‌కు వచ్చే రోగులకు సరైన వైద్య సేవలు అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సూచించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి మాట్లాడుతూ అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. సంఘ సమావేశాలు, సర్వ సభ్య సమావేశాలు వేర్వేరుగా నిర్వహించాలని పలువురు సభ్యులు కోరగా అందుకు జెడ్పీ చైర్‌పర్సన్ అంగీకరించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి, కె.రాజ్ కుమార్, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

నీటి వసతి ఉంటే అయిల్‌పామ్ సాగు మేలు


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు పైల పోతురాజు

నాతవరం: ఆయిల్ పామ్ తోటలు సాగు చేయడం ద్వారా అన్ని విధాలుగా బాగుంటుందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత రాష్ట్ర అయిల్ ఫామ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు పైల పోతురాజు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవం సందర్భంగా అయిల్‌పామ్ తోటలు సంఘం జిల్లా అధ్యక్షుడు పి.వి.సీతారామరాజు ఆధ్వర్యంలో రైతులు సమావేశం నిర్వహించారు. పోతురాజు మాట్లాడుతూ తాను 1997 సంవత్సరం నుంచి అయిల్‌పామ్ తోటలు సాగు చేస్తున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరుగా పని చేశానని, ఆ సమయంలో ఆయిల్‌పామ్ ధర బాగుందన్నారు. ప్రస్తుతం ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే అయిల్ పామ్ తోటలు సాగు చేయడం లాభదాయకమన్నారు. కూలీల సమస్యతో పాటు దళారులు ఉండరని మార్కెట్ సదుపాయం ఉంటుందని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సీతారామరాజు మాట్లాడుతూ నీటి వసతి ఉన్న భూములలో అయిల్‌పామ్ తోటలు వేసేందుకు అసక్తి చూపాలని తోటలో అంతర పంటలు వేయాలన్నారు. పంతాంజలి సంస్థ మేనేజర్ చంద్రశేఖర్, కె.రమేష్ యాంత్రీకరణ, ఎరువుల వాడకం, గెలల కోత తదితర అంశాలపై రైతులకు వివరించారు. తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, వల్సంపేట సర్పంచ్ ఇట్టంశెట్టి శ్యామల, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీనివాస్ పామాయిల్ కంపెనీ అసిస్టెంటు మేనేజరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారాక వేధింపులు మొదలయ్యాయి...

మధ్యాహ్న భోజన కార్మికుల ఆవేదన


తమ ఆవేదనను వివరిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

కోటవురట్ల: 15 ఏళ్లుగా ఇక్కడ వంట చేస్తున్నాం..ప్రభుత్వం మారిన దగ్గరి నుంచి మా పరిస్థితి దారుణంగా మారిపోయింది. వంట ఏజెన్సీ ఎలాగూ మార్చేసుకున్నారు. మమ్మల్ని కూడా తీసెయ్యాలని టార్గెట్ పెట్టుకున్నారు. మాకు మేము పని మానేయాలనే ఉద్దేశ్యంతో మాపై నిందలు వేస్తూ వేధిస్తున్నారు. ఆ నిందలు, తిట్లు భరించలేకపోతున్నాం.. ఇక ఇక్కడ పని చేయలేం అంటూ పాములవాకలోని కిల్లాడ రామ్మూర్తినాయుడు జెడ్పీ హైస్కూల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు ఆవేదన చెందారు. విషయంలోకి వెళ్తే జెడ్పీ హైస్కూల్‌లో అదే గ్రామానికి చెందిన సుర్ల చంటి, మేడపరెడ్డి రాజు, కూండ్రపు సత్యవతి, ఇందల సన్యాసమ్మ మధ్యాహ్న భోజన పథకంలో 15 ఏళ్లుగా వంట కార్మికులుగా పని చేస్తున్నారు. అయితే కొద్ది కాలంగా తమపై వేధింపులు మొదలయ్యాయని, కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి హెచ్‌ఎం లక్ష్మీనారాయణ తమను వినరాని విధంగా దూషిస్తున్నారని ఆరోపించారు. గుడ్లు, బియ్యం, పప్పులు అన్నీ లెక్కగా ఇస్తున్నా తాము దొంగతనం చేస్తున్నామని ఆరోపిస్తూ దారుణంగా తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై హెచ్‌ఎం లక్ష్మీనారాయణను వివరణ కోరగా పిల్లలకు పెడుతున్న గుడ్లు, అన్నం తక్కువ వస్తోందని, ఇదేంటని ప్రశ్నిస్తే తనపై తిరగబడుతున్నారని, వారిని దూషించలేదని చెప్పారు.

పెద్దేరు నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


నదిలో లభ్యమైన సన్యాసిరావు మృతదేహం

చోడవరం: పెద్దేరు నదిలో జన్నవరం వంతెన సమీపంలో గల్లంతైన వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైంది. కె.కోటపాడు మండలం, చౌడువాడ గ్రామానికి చెందిన ఎస్. సన్యాసిరావు (35) చోడవరం మండలం జన్నవరం గ్రామంలో తన బంధువులు ఒకరు మృతిచెందడంతో అతని అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఇక్కడకు వచ్చారు. పెద్దేరు నది ఒడ్డున స్మశాన వాటికలో అంత్యక్రియలు అనంతరం స్నానంచేసేందుకు పక్కనే ఉన్న పెద్దేరు నదిలో అందరితోపాటు సన్యాసిరావు కూడా దిగారు. ప్రమాదశాత్తు నదిలో మునిగిపోయి గల్లంతయ్యారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది, చోడవరం పోలీసులు ప్రమాదస్థలానికి వచ్చి మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృతుడు సన్యాసిరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటి యజమాని మృతి చెందడంతో భార్య, కుటుంబసభ్యులు బోరున విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నేడే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 2.0

- బడి పండగకు ముస్తాబైన పాఠశాలలు, కళాశాలలు
- జిల్లాలో 2232 పాఠశాలలు, 134 జూనియర్ కళాశాలల్లో జరగనున్న కార్యక్రమాలు


విజయకృష్ణన్, కలెక్టర్, అనకాపల్లి

అనకాపల్లి: జిల్లాలో పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు గురువారం ఘనంగా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు పండగ వాతావరణంలో జరుగుతుందని, జిల్లాలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ పెద్ద ఎత్తున నిర్వహించదానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరుసగా రెండో ఏడాది పేరెంట్స్ టీచర్స్ మీట్ జరుగుతుందని, గత ఏడాది కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే జరిగిన ఈ కార్యక్రమాలు ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో నిర్వహించడం విశేషమన్నారు. జిల్లా వ్యాప్తంగా 2232 పాఠశాలల నుంచి సుమారు 1,87,000 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలసి హాజరుకానున్నారు. జిల్లాలో 134 జూనియర్ కళాశాలల నుంచి 24,781 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సహా హాజరు కానున్నారని పేర్కొన్నారు. స్వయంగా విద్యార్థులే ఆహ్వానాలను అందించడం, ఆహ్వానం తో పాటు ఒక ఫార్మాట్‌ను కూడా ఇవ్వడం , తల్లిదండ్రులు ఆ ఫార్మాట్‌పై వారి అభిప్రాయాన్ని రాసి తిరిగి సమర్పించేలా రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధికి కావలసిన మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల చదువు, భవిష్యత్తు, ఆరోగ్యం తదితర అంశాలపై తల్లిదండ్రులతో, ఉపాధ్యాయులతో చర్చ జరుగుతుందన్నారు. టీచర్, స్టూడెంట్, పేరెంట్స్‌తో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థి గత ఏడాది సాధించిన ప్రతిభను, ఈ ఏడాది సాధించవలసిన దాని గురించి చర్చ జరుగుతుందని ఆమె చెప్పారు.

అర్లిలో భూసర్వే అడ్డగింత

- సాగులో ఉన్న భూములకు పట్టాలను ఇప్పిస్తారని చెబితే విశ్వసించాం
- ఇప్పుడు భూములు తీసుకుంటామంటే ఎలా?
- ఆవేదన వ్యక్తం చేసిన అన్నదాతలు
- గ్రామ సభ నిర్వహించిన తరువాతే సర్వేకు అంగీకరిస్తామని తేల్చిచెప్పిన రైతులు


ఆర్లిలో భూముల సర్వే జరగకుండా రోడ్డుకు అడ్డంగా ఉన్న మహిళలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ పైడపునాయిడు, ఎస్‌ఐ లక్ష్మీనారాయణ

కె.కోటపాడు: ఎస్‌ఈజెడ్ పేరిట రెవెన్యూ అధికారులు ఆర్లి రెవెన్యూలో నిర్వహిస్తున్న భూ సర్వేను బుధవారం గ్రామస్తులు, మహిళలు అడ్డుకున్నారు. సర్వే ఎందుకు నిర్వహిస్తున్నారో తెలియజేయాలని, భూముల వివరాలను ఎందుకు నమోదు చేస్తున్నారో చెప్పాలని వీఆర్వో, సర్వేయర్లను డిమాండ్ చేశారు. తమ భూముల వివరాలను నమోదు చేసేందుకు అంగీకరించబోమని వారు స్పష్టం చేశారు. గ్రామసభ నిర్వహించిన తరువాత సర్వే జరపాలి తప్ప, గ్రామసభ జరగకుండా ఈ విధంగా రైతుల భూముల వివరాలను నమోదు చేయడం తగదన్నారు. సాగులో ఉండి, పట్టాలు లేని రైతులకు పట్టాలు మంజూరు చేసేందుకు ఇది వరకూ ఈ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ హామీ ఇచ్చారని, ఇప్పుడు ఈ భూములను సర్వే చేసి, ఎస్‌ఈజెడ్‌కు కేటాయిస్తే ఏ విధంగా తామంతా జీవనం సాగించాలని మహిళలు కాళ్ళ నాగమణి, బోశం నారాయణమ్మ, యడ్లంకి పైడమ్మ, మునగపాక లక్ష్మి, రుత్తుల పార్వతి, దమ్ము లక్ష్మి, తాళ్ళ పార్వతి సిబ్బందిని ప్రశ్నించారు. మా భూములను లాక్కుంటే రోడ్డుపై పడవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేటాయించిన డీపట్టా భూములను తామంతా తాతముత్తాతల నుంచి లక్షలాది రూపాయలు వెచ్చించి సాగుకు అనుకూలంగా తీర్చిదిద్దుకున్నట్టు మాజీ సర్పంచ్ బోశం కృష్ణారావు, బోశం కాసుబాబు, రుత్తుల పాత్రుడు, కక్కల అప్పలనాయుడు తెలిపారు. ఎటువంటి సమాచారం లేకుండా బలవంతంగా సర్వేను చేపట్టి వివరాలను నమోదు చేయడం తగదన్నారు. సాగులో ఉన్న ఈ భూములపై హక్కులను వదులుకోవాలంటే మా కుటుంబాల పరిస్థితి ఏంటని రెవెన్యూ అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేను అడ్డుకున్న సమాచారాన్ని సిబ్బంది రెవెన్యూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సర్వే ప్రాంతం వద్దకు కె.కోటపాడు సీఐ పైడపునాయుడు, కె.కోటపాడు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ లక్ష్మీనారాయణ చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది ఈ ప్రాంతంలో సర్వేను చేపడుతున్నారని, సహకరించాలని గ్రామస్తులను కోరారు. గ్రామసభ నిర్వహించకుండా సర్వే చేయడం తగదని గ్రామస్తులు పోలీసులకు తెలపడంతో గ్రామసభను నిర్వహించిన తరువాతే సర్వే చేపట్టే చర్యలను తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందికి సీఐ పైడపునాయుడు తెలిపి వెళ్లిపోయారు.

10న కె.కోటపాడుకు పవిత్ర కలశ యాత్ర

కె.కోటపాడు: అఖిలభారత యాదవ మహా సభ ఆధ్వర్యంలో దేశంలో నిర్వహిస్తున్న పవిత్ర కలశ యాత్ర వాహన ర్యాలీ బిహార్ రాష్ట్రం నుంచి ఈ నెల 10న కె.కోటపాడుకు చేరుకుంటుందని అఖిల భారత యాదవ మహాసభ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ పల్లా రాజేశ్వరరావు తెలిపారు. కె.కోటపాడు నుంచి 11న వాహన ర్యాలీతో ఈ కార్యక్రమం సాగనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా గల యాదవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బదిలీపై నగరానికి రానున్న న్యాయమూర్తులు

విశాఖ లీగల్: రాష్ట్ర హైకోర్టు పలువురు అదనపు జిల్లా న్యాయమూర్తులను బదిలీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.హరినారాయణ అనకాపల్లి జిల్లా చోడవరం 9వ అదనపు జిల్లా న్యాయమూర్తిగా బదిలీపై వస్తున్నారు. చోడవరం 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి కె.రత్నకుమార్ విశాఖలోని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తిగా బదిలీపై నగరానికి వస్తున్నారు.

సత్యవరం శివాలయంలో దొంగతనం


దొంగలు పగుల కొట్టిన హుండీ

మాడుగుల: మండలంలో సత్యవరం శివాలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ లోపల ఉన్న హుండీ పగల గొట్టి సుమారు రూ.3వేలు చిల్లర దొంగలించుకు పోయారని ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వైభవంగా వెంకన్న గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్న భక్తజనం

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లి పాండవుల మెట్టపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ బుధవారం ఘనంగా జరిగింది. సాయంత్రం 4 గంటల నుంచి తొలి మెట్టు వద్ద కొబ్బరికాయ కొట్టిన అనంతరం సుమారు 7 కిలోమీటర్ల మేర గిరిప్రదక్షిణ చేపట్టారు. దేవరాపల్లి మండలంతో పాటు చుట్టు ప్రక్కల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. దారిపొడవునా పలువురు భక్తులు ప్రసాదాలు, తాగునీరు, శీతల పానీయాలను అందజేసి భక్తిని చాటుకున్నారు.

లాయర్ల కేసుతో బీఎన్ రోడ్డు పనులు ప్రారంభం

- నాసిరకంగా చేపడుతున్న పనులు
- పత్తాలేని ఆర్‌అండ్‌బీ అధికారులు


ఎల్‌బీపురం వద్ద మట్టితో కప్పిన గొయ్యి


వడ్డాది బీఎన్ రోడ్డులో చేస్తున్న పనులు

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డు గోతుల పూడ్చివేత పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు శిథిలమై గోతులు పడ్డ బీఎన్ రోడ్డును బాగు చేయాలని ఆందోళనలు, ధర్నాలు చేపట్టారు. మూడు రోజుల కిందట చోడవరం కోర్టులో బీఎన్ రోడ్డు పనులు చేపట్టాలని ప్రముఖ లాయర్లు కోర్టులో పిటిషన్ వేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులకు, గుత్తేదారులకు కోర్టు అంక్షింతలు వేస్తుందన్న భయంతో ముందుగానే బీఎన్ రోడ్డులో గోతులను కప్పే పనులు చేపట్టారు. అయితే రోడ్డు గోతుల పూడ్చివేత పనులు నిబంధనలు ప్రకారం చేయడం లేదని విమర్శిస్తున్నారు. వడ్డాది, బంగారుమెట్ట, ఎల్‌బీ పురం, శింగవరం తదితర గ్రామాల వద్ద పెద్ద పెద్ద గోతుల్లో పొక్లెయిన్‌తో మట్టి వేసి గోతులను కప్పేస్తున్నారు. మట్టిపై తూతూ మంత్రంగా రాయి బుగ్గి వేసి రోడ్డు పనులు చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు పరివేక్షణ లేకుండా గుత్తేదార్లు చోడవరం, మాడుగుల పరిధిలో ఉన్న బీఎన్ రోడ్డులో పనులు చేపడుతున్నారు. దీనివల్ల ఏ మాత్రం వర్షం కురిసినా మరలా బురదలా రోడ్డు మారి గోతులు పడుతుందని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిధులు వృధా కాకుండా పటిష్ఠంగా ఆర్‌అండ్‌బీ రోడ్డులో పనులు చేపట్టాలని పలువురు ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

బల్క్‌డ్రగ్‌పార్క్‌కు అదనంగా భూములు

- 790 ఎకరాల సేకరణకు కేబినెట్ ఆమోదం
- రైతుల నుంచి వ్యతిరేకత


సీహెచ్‌ఎల్‌పురంలో ప్రభుత్వం బల్క్‌డ్రగ్ పార్క్ కోసం అదనంగా సేకరించనున్న భూములు

నక్కపల్లి: మండలంలో ఏర్పాటు కానున్న బల్క్‌డ్రగ్ పార్క్‌కు అదనంగా భూములు కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. 790 ఎకరాలు సేకరించేందుకు బుధవారం జరిగిన రాష్ట్రమంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. ఇప్పటికే బల్క్ డ్రగ్ పార్క్ కోసం ప్రభుత్వం రెండు వేల ఎకరాలు కేటాయించింది. నక్కపల్లి మండలంలో విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో భాగంగా పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా వేంపాడు, చందనాడ, రాజయ్యపేట, డీఎల్‌పురం, అమలాపురం, గ్రామాల్లో 4,500 ఎకరాలు సేకరించిన విషయం తెలిసిందే. వీటిలో బల్క్‌డ్రగ్ పార్క్ కోసం గత ప్రభుత్వ హయాంలోనే రెండు వేల ఎకరాలను కేటాయించారు. ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో మరో 2,400 ఎకరాలను ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ ఇండియా స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించారు. బల్క్‌డ్రగ్‌పార్క్‌కు మరో 790 ఎకరాలు అవసరం కానుంది. దీంతో పెదతీనార్లలో 600 ఎకరాలు, సీహెచ్‌ఎల్‌పురంలో 190 ఎకరాలు సేకరించేందుకు ఏపీఐఐసీ నిర్ణయించి ఈమేరకు ప్రభుత్వ ఆమోదానికి పంపింది. బుధవారం జరిగిన కేబినెట్‌సమావేశంలో ఈ భూములు సేకరించేందుకు ఆమోదం తెలిపింది. రైతులంతా భూములు ఇచ్చేందుకు తీవ్రవ్యతిరేకత చూపుతున్నారు. రైతుల నిరసన, ఆందోళన పట్టించుకోకుండా మంత్రిమండలి భూసేకరణకు అమోదం తెలపడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎకరాకు రూ.37 లక్షలు చెల్లిస్తామని అధికారులు చెబుతున్నారు. భూసేకరణకు రైతులు ససేమిరా అంటున్నారు. నోటిఫికేషన్ విడుదల చేయకుండా నేరుగా డైరెక్ట్ పర్చేజ్‌పేరుతో రైతులనుంచి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోంది. ఇలా కొనుగోలు చేస్తే రైతులకు కేవలం నష్టపరిహారం మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ఎటువంటి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాల్సిన అవసరం లేదు. భూములిచ్చిన రైతులు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకింద రూ.25 లక్షలు నష్టపరిహారం డిమాండ్ చేస్తున్నారు.2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.

కదంతొక్కిన కార్మికలోకం



నర్సీపట్నంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ ప్రజాసంఘాలు నిర్వహిస్తున్న ర్యాలీ



అనకాపల్లి మెయిన్ రోడ్ మీదుగా ర్యాలీ చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నర్సీపట్నం: లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మిక హక్కులు, కనీస వేతనాలు, ఇతర సామాజిక చట్టాలు తేవాలన్న డిమాండ్‌తో నిర్వహించిన దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా నర్సీపట్నంలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీలు భారీ ర్యాలీ నిర్వహించాయి. అబిడ్స్ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ కొనసాగింది. మానవహారంగా ఏర్పడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ బీజేపీ మూడోసారి అధికారం చేపట్టిన తరువాత సంపద సృష్టికర్తలైన కార్మికులను, రైతులను పట్టించుకోవడం లేదన్నారు. నల్ల చట్టాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. విశాఖ స్టీల్, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్మిక కుటుంబాలను వీధిన పడేస్తున్నారని ఆరోపించారు. 12 గంటల పనిదినాలను అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఎల్ఐసీ, బ్యాంకుల ఉద్యోగులు పని గంటల భారంతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరకు చట్టం చేయాలన్నారు. ఆశా, మిడ్డేమీల్, అంగన్‌వాడీ కార్యకర్తలపై యాప్‌ల భారం పెంచుతున్నారని, సమ్మెకాలం ఒప్పందాలను అమలు చేయటం లేదని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు, స్కీమ్ వర్కర్లకు సంక్షేమ పథకాలను అమలు చేయటం లేదన్నారు. 104,108 యాజమాన్యాలు ఉద్యోగులకు కార్మిక చట్టాలను అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ యూనియన్ రీజినల్ నాయకుడు పి.సాయికిరణ్, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.ధనార్జన్, ఎల్ఐసీ బ్రాంచ్ యూనియన్ నాయకుడు కె.కె.వి. పడాల్, ఏజెంట్లు అసోసియేషన్ నాయకుడు వి.శ్రీరామ్మూర్తి, ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు యు.కె.రావు, పలు సంఘాల నాయకులు వి.సామ్రాజ్యం, అరుణ, ఒమ్మి నూకరాజు, కె.రామకృష్ణ, సత్తిబాబు, శివ, కె.నానాజీ, బాబురావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, సీపీఐ నాయకులు జి.గురుబాబు, కె.లక్ష్మి, రాధాకృష్ణ, శ్రీరామ్మూర్తి, చిన్ననాయుడు, మేకా సత్యనారాయణ, శివలంక కొండలరావు, శ్రీనివాసరావు, భాస్కరరావు, భవాని తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ చట్టాలను రద్దు చేయాలి

అనకాపల్లి టౌన్: కేంద్ర ప్రభుత్వం దొడ్డి దారిన తీసుకు వచ్చిన లేబర్ కోడ్స్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం పలు కార్మిక సంఘాలు అనకాపల్లి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయం నుంచి నాలుగురోడ్ల జంక్షన్, ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు చట్టాలను రద్దు చేయాలని, యథావిధిగా కార్మిక చట్టాలను కొనసాగించాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు త్రినాథ్, భద్రరావు, వీరాచారి, చైతన్య, వియ్యపు రాజు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం బస్టాప్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన లక్షణ్ మాట్లాడుతూ ముఠా కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఏఐటీయూసీ నాయకుడు వైఎస్ భద్రం మాట్లాడుతూ ఆటో కార్మికులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఆటో కార్మికులకు వాహనమిత్ర పథకం కింద పదిహేను వేల రూపాయలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శ్రీరామదాసు అబ్బులు,మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బంగారు రవి, రిక్షా కార్మికుల సంఘం నాయకులు సూదికొండ మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిరసనలకు అనుమతి తప్పనిసరి

కశింకోట: రాజకీయ పార్టీలు గాని, ఎస్‌ఎఫ్‌ఐ, ఇతర సంఘాలు గాని బహిరంగ ప్రదేశాలు, భవన సముదాయాల్లో నిర్వహించే తమ కార్యకలాపాలు, నిరసనలు తెలిపేందుకు ముందస్తుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ అల్లు స్వామినాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు ఎస్‌ఎఫ్‌ఐ, సీపీఐ, సీపీఎం, ఇతర ప్రజా సంఘా బహిరంగ ప్రదేశాల్లో ర్యాలీలు, దీక్షలు, నిరసనలు చేపట్టడానికి, భవన సముదాయాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి అనుమతి తీసుకోవాలన్నారు. ఇందుకు జిల్లా ఎస్పీ, డీఎస్పీలను సంప్రదించి అనుమతి పొందాలన్నారు. అనుమతి లేకుండా నిర్వహించే కార్యక్రమాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, శాంతి భద్రతల దృష్ట్యా ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


వేంకటేశ్వర స్వామికి పంచామృతాభిషేకాలు చేస్తున్న ఆలయ అర్చకులు

అనకాపల్లి: స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన బుధవారం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నమయ్య అమృత వర్షిణి సభ్యులచే కోలాటం, భక్తి సంకీర్తనలు వంటి పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఈవో బి. మురళీ కృష్ణ, అర్చకులు పులఖండం ప్రసాద్ బాబు, పులఖండం రాజేష్, ధర్మకర్తలు గోలి మురళి, సీహెచ్ నూకరాజు, వేదుల సూర్య ప్రభ, కొణతాల అరుణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల ప్రగతికి తోడ్పడాలి


మాట్లాడుతున్న డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి

కశింకోట: ప్రణాళికాబద్ధంగా పని చేసి పంచాయతీల ప్రగతికి తోడ్పడాలని డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి కోరారు. కశింకోటలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచికపై కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలకు బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పంచాయతీల అభివృద్ధికి అనుసరించాల్సిన పద్ధతులు, విధానాలపై దిశా నిర్దేశం చేశారు. ఎంపీడీవో వి.వి. రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో వెంకట తోటారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

కశింకోట: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ జరగనున్నట్లు ఎంఈవో–2 కేఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 51 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	----	----
రెండో రకం	3,500	3,500
మూడో రకం	3,150	3,400

అనకాపల్లి సినిమాలు

రాజా	: కృష్ణదికి కెంతో
సత్యనారాయణ స్క్రీన్-1	: కన్నప్ప
సత్యనారాయణ స్క్రీన్-2	: 3 డి
పర్తిసాయి	: కుబేర
షిర్డీసాయి	: తమ్ముడు
వెంకటేశ్వర	: కుమారి 21ఎఫ్
శ్రీ సత్య	: 3బీహెచ్‌కె
రామచంద్ర	: మార్గన్

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 334 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 256 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 27 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్–10 యూనిట్లు, బి పాజిటివ్–4 యూనిట్లు, ఒ పాజిటివ్–11 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.


నూతలగుంటపాలెంలో నారు వేయడానికి సిద్ధం చేస్తున్న నారుమళ్లు


ఏనుగుతునిలో వేసిన నారుమడి

ఏరువాక సాగారోరన్నో చిన్నన్న.. నీ కష్టమింక తీరునురోరన్నో చిన్నన్న

- ఖరీఫ్ పనుల్లో తలమునకలైన అన్నదాతలు
- దుక్కి దున్ని నారుమళ్లు వేసేందుకు సిద్ధం
- ఈ ఏడాది వరి సాగు ఆశాజనకంగా ఉంటుందంటున్న రైతులు

కశింకోట: మండలంలోని రైతాంగం ఖరీఫ్ వరి నారుమళ్లు వేయడం ప్రారంభించారు. ప్రస్తుతం సీజన్ కావడంతో అడపా దడపా గ్రామాల్లో నారుమళ్లు వేస్తున్నారు. మరికొందరు రైతులు భూమిని దుక్కి దున్ని నారుమళ్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. మండలంలో పండించే ప్రధాన పంటలు వరి, చెరకు. వీటిలో ఖరీఫ్ వరి సాగు ప్రథమ స్థానంలో నిలుస్తోంది. ఈ పంటను అత్యధికంగా వర్షాధారంగా, బోర్ల ద్వారా సాగు చేస్తారు. శారదా నది, జమాదులపాలెం వద్ద జలాశయం, మామిడివాక, కొండ గెడ్డలు, సాగునీటి చెరువులు, గ్రోయిన్ల నీరు ఆధారం. వీటి పరిధిలోని కశింకోట, బయ్యవరం, తేగాడ, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, నరసాపురం, ఏఎస్ పేట, సోమవరం, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, అచ్యుతాపురం, జమాదులపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, గొబ్బూరు, అచ్చెర్ల, జి. భీమవరం, లాలంకొత్తూరు, సుందరయ్యపేట, కన్నూరుపాలెం, తీడ, చెరకాం తదితర గ్రామాల్లో వరి ఎక్కువగా సాగు చేస్తారు. సాధారణంగా ఏటా జూలై నెలలో రైతులు వరి నారుమళ్లు వేస్తారు. రెండు, మూడు దఫాలు గడ్డి మొలవకుండా నారు మడి కలియదున్ని సిద్ధం చేసి వరి విత్తనాలు జల్లుతారు. దాదాపు నెలకు నారు ఎదిగి నాట్లు వేయడానికి సిద్ధం అవుతుంది. ఈ నేపథ్యంలో ఆగస్టులో నాట్లు ప్రారంభిస్తారు. ఇవి సాధారణంగా సెప్టెంబర్ నెలాఖరు వరకు జరుగుతాయి. డిసెంబర్ నెలలో పంట పండి చేతికొస్తుంది. ఇప్పటికే మండల వ్యవసాయ కార్యాలయం, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఈ ప్రాంతంలో ఎక్కువగా సాగు చేసే ఆర్‌జీఎల్‌తో పాటు సాంబ మసూరి, సోనా మసూరి తదితర రకాల వరి విత్తనాలను ప్రభుత్వం అందించిన రాయితీపై ఎకరాకు బస్తా వంతున పంపిణీ చేపట్టి నిర్వహిస్తున్నారు. ఇవి ముగింపు దశకు వచ్చాయి. సుమారు 850 టన్నుల మేర విత్తనాలను అందుబాటులో ఉంచి పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.


కశింకోటలో నారు వేయడానికి దుక్కి దున్ని సిద్ధం చేసిన నారుమడి

వరి విస్తీర్ణం ఇలా..

మండలంలో వరి సాధారణ విస్తీర్ణం సుమారు 2 వేల ఎకరాలు. గత ఏడాది దీన్ని మించి 2300 ఎకరాల మేర సాగు చేశారు. ఈ ఏడాది కూడా సాగు విస్తీర్ణం మరింత పెరగగలదని అధికారులు భావిస్తున్నారు. ఈ ఏడాది చెరకు విస్తీర్ణం తగ్గింది. ప్రస్తుతం సుమారు 470 ఎకరాల్లో కార్శి, ఉడుపు తోటలు సాగవుతున్నాయి. సుమారు 400 ఎకరాల వరకు విస్తీర్ణం తగ్గిందని సమాచారం. ఈ నేపథ్యంలో ఈ ఏడాది వర్షాలు కురిసి వాతావరణం అనుకూలిస్తే ఆ మేరకు కూడా అదనంగా వరి సాగు విస్తీర్ణం పెరగగలదని అధికారులు భావిస్తున్నారు.

> **వరి విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది..**
>
> మండలంలో ఖరీఫ్ వరి నారుమళ్లు వేసే సీజన్ ప్రారంభమైంది. ఇప్పటికే పలు గ్రామాల్లో అక్కడక్కడ నారుమళ్లు వేశారు. ఇంకా మొలక దశలో ఉన్నాయి. ముందు నారుమళ్లు వేసిన రైతులు వచ్చే నెల రెండో వారంలో నాట్లు వేసే అవకాశం ఉంది. ఈ ఏడాది వరి విస్తీర్ణం గత ఏడాది కంటె అదనంగా సుమారు 400 ఎకరాల వరకు పెరిగే అవకాశం ఉంది. చెరకు విస్తీర్ణం తగ్గడంతో దాని సాగు రైతులు వాతావరణం అనుకూలిస్తే వరి పంటపై దృష్టి సారించే అవకాశం ఉంది. రైతులకు విత్తనాల కొరత లేకుండా అందుబాటులో ఉంచి పంపిణీ చేస్తున్నాం.
>
> – ఎం. స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట.

యాజమాన్యాలకు కొమ్ము కాస్తున్న కేంద్ర ప్రభుత్వం

ప్రజా సంఘాల ఆందోళనలో పలువురు నేతలు


కశింకోటలో సీఐటీయు ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాల కార్మికుల ర్యాలీ

కశింకోట: కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కశింకోటలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందించాయి. దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా స్థానిక సంతబయలు నుంచి ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ముఠా కార్మికులు, పంచాయతీ, పారిశుధ్య కార్మికులు ర్యాలీగా బయలుదేరి పొట్టి శ్రీరాములు పార్కు, అమరపల్లి వీధి, స్టేట్ బ్యాంకు, జాతీయ రహదారి మీదుగా నినాదాలు చేస్తూ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే విధంగా యాజమాన్యాలకు కొమ్ము కాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తుందని విమర్శించారు. వీటిని తక్షణమే రద్దు చేయాలన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి. వరలక్ష్మి, ప్రజా సంఘాల ప్రతినిధులు టి. తనుజ, ఎం. శ్రీదేవి, కె. శాంతి, బి. సూర్యలక్ష్మి, కె. శివలక్ష్మి, బి. బెన్నయ్య, పి.ఎస్.వి. పరమేశ్వరరావు, జి. కొండబాబు, ఏపీ అప్పారావు, కన్నబాబు, శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: విద్యుత్ శాఖ డి–1 సెక్షన్ 11 కేవీ లక్ష్మీనారాయణనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతు పనుల నిమిత్తం ఈనెల 11 ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల రింగ్‌రోడ్డు, నెయ్యిల వీధి, మళ్ల వీధి, పెరుగుబజార్, కోట్నీ వీధి, చిన్న వీధి, కరణాల వీధి, గాంధీ బొమ్మ జంక్షన్, నర్సింగరావుపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొత్తూరు విద్యుత్ ఫీడర్ పరిధిలో.. : కశింకోట సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల నిమిత్తం 33/11 కేవీ, హెచ్‌టీ/ఎల్‌టీ లైన్లు, జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం ఈనెల 11న అనకాపల్లి మండలం కొత్తూరు ఫీడర్ పరిధిలో కూండ్రం, కుంచంగి, రొంగలివానిపాలెం, వేట జంగాలపాలెం, సంపతిపురం, సత్తమ్మ కాలనీ, వెంకుపాలెం, విస్సన్నపేట గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ నిలుపుదల జరుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గాంధీ మార్కెట్ ఫీడర్ పరిధిలో..

గవరపాలెం 11 కేవీ గాంధీ మార్కెట్ ఫీడర్ పరిధిలో ఈనెల 11 ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ నిలుపుదల జరుగుతుందని ఈఈ కె.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గవపాలెం పార్కు సెంటర్, గౌరీ సంఘం, సతకంపట్టు, సంతోషిమాత గుడి రహదారి, రింగ్‌రోడ్డు, దాడి భోగలింగం స్కూల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా జరగదని, వినియోగదారులు సహకరించాలని అన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు


అయ్యప్పస్వామి ఆలయంలో సుందరకాండ పారాయణ చేస్తున్న మహిళలు

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డు కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ఆవరణలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష అర్చనలు జరిగాయి. మధ్యాహ్నం ఆలయానికి వచ్చిన భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. బొండాడ ప్రమీల ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధి లక్ష్మణరావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అపరాధ రుసుం వసూలు


కొప్పాకలో పాన్ షాపు వద్ద అపరాధ రుసుం వసూలు చేస్తున్న ఎస్ఐ రవికుమార్

అనకాపల్లి టౌన్: మండలంలోని కొప్పాక పాఠశాల సమీపంలో ఉన్న పాన్ షాపుల్లో రూరల్ ఎస్ఐ రవి కుమార్ తన సిబ్బందితో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాన్ షాపులకు రూ. 200 చొప్పున అపరాధ రుసుం వసూలు చేశారు. పాఠశాలల పరిసరాలలో సిగరెట్లు, పాన్ మసాలాలు, గుట్కా తదితర మాదక ద్రవ్యాలు విక్రయించకూడదన్నారు. నిబంధనలను ధిక్కరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రాజన్న జయంతి


పార్టీ శ్రేణులకు కేక్ తినిపిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు మిద్దే రాజాచంద్రరావు

అనకాపల్లి: మండలంలోని మార్టూరులో దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి మంగళవారం రాత్రి ఎంపీటీసీ మిద్దే రాజాచంద్రరావు, గ్రామ సర్పంచ్ కరణం రెవెన్యూ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ అభిమానులు డీజే సౌండ్‌తో గ్రామంలో ర్యాలీ నిర్వహించి, రామాలయం వద్ద కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు గంట్ల ప్రకాష్, వార్డు మెంబర్లు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలపై దృష్టి సారించాలి

అనకాపల్లి: జిల్లాలో సంక్షేమ వసతి గృహాల్లో బలహీన వర్గాల విద్యార్థులు విద్యను అభ్యసిస్తారని, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు దృష్టి సారించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లల చదువుపై దృష్టి సారించాలంటే చదువుకోవడానికి, రాసుకోవడానికి పుస్తకాలు అందుబాటులో ఉండాలన్నారు. పిల్లల వ్యక్తిగత అవసరాలకు సంబంధించిన వస్తువుల సరఫరాలో అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. స్కూళ్లు మొదలుపెట్టి నెలలు గడుస్తున్నా అధికారులు దృష్టి సారించకపోవడం పట్ల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

రోడ్డు పక్క తుప్పల తొలగింపు


తాళ్లపాలెంలో శుభ్రపరిచిన ప్రాంతం


బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో తొలగిస్తున్న మట్టి దిబ్బలు


కశింకోట: మండలంలోని తాళ్లపాలెం కూడలి నుంచి నర్సీపట్నం వైపు వెళ్లే రోడ్డుకు రెండు వైపులా పేరుకుపోయిన తుప్పలు, గడ్డి బుధవారం తొలగించారు. జిల్లా పంచాయతీ అధికారి ఈ. సందీప్ ఆదేశాల మేరకు పాదచారులు, వాహన చోదకులకు ఇబ్బంది కలగకుండా తాళ్లపాలెం పంచాయతీ పరిధిలోని రోడ్డును బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో తుప్పలు తొలగించి మట్టి దిబ్బలను చదును చేసి శుభ్రపరుస్తున్నారు. డిప్యూటీ ఎంపీడీవో వెంకట తోటారావు పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి ఎస్. సత్యారావు పనులను పరిశీలించారు.

జన సురక్షా పథకాలపై అవగాహన


గొండుపాలెంలో జన సురక్షా పథకాలపై వివరిస్తున్న బ్యాంక్ మేనేజర్ శ్రావణ్‌బాబు, వికాస్

కె.కోటపాడు : బ్యాంక్‌లో ఖాతా కలిగిన 18 ఏళ్ల పైబడిన వారు తప్పకుండా జన సురక్షా పథకాల్లో చేరాలని చౌడువాడ ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ కె.శ్రావణ్‌బాబు అన్నారు. గొండుపాలెం గ్రామంలో మంగళవారం రాత్రి ఖాతాదారులకు జన సురక్షా పథకంలో అమలు చేస్తున్న పీఎం సురక్షా బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా పథకం, అటల్ పెన్షన్ యోజన పథకాలపై అవగాహన కల్పించారు. ఏడాదికి రూ.20 ప్రీమియం నగదును చెల్లించిన ఖాతాదారులకు పీఎం సురక్షా బీమా యోజన పథకం వర్తిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా ఏడాది కాలంలో 70 ఏళ్ల వయస్సు గల వారు ప్రమాదాల బారిన పడి మరణించిన సమయాల్లో వారి కుటుంబాలకు బ్యాంక్ ద్వారా రూ.2లక్షలు లభిస్తుందని, అలాగే పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన పథకం ద్వారా ఏడాదికి రూ.436 చెల్లిస్తే 50 ఏళ్లలోపు వారికి ప్రమాదవశాత్తూ లేదా సహజ మరణం వాటిల్లినా వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు అందుతుందన్నారు. అటల్ పెన్షన్ యోజన పథకంలో 18 నుంచి 39 ఏళ్ల వయస్సు గల వారు అర్హులన్నారు. ఈ పథకంలో వయస్సును అనుసరించి నెలవారీ ప్రీమియం చెల్లించిన వారికి 60 ఏళ్లు నిండిన తరువాత నెలనెలా పింఛను లభిస్తుందన్నారు.

వైఎస్సార్ విగ్రహం తొలగింపు అన్యాయం


కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న

అనకాపల్లి: దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆయన జయంతి రోజున కూటమి నాయకులు, జీవీఎంసీ జోనల్ సిబ్బంది తొలగించడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారంలో ఉన్న కూటమి శ్రేణులు సంయమనం పాటించక బడుగు, బలహీన వర్గాల ఆరాధ్య దైవం రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని తొలగించాలని ఆందోళన చేయడం శోచనీయమని, స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు అత్యంత ఆప్తులని, అటువంటి వారి విగ్రహాన్ని తొలగించడంలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడం శోచనీయమన్నారు. జీవీఎంసీ జోనల్ అధికారులు పట్టణ పరిధిలో అనుమతులు లేని విగ్రహాలను తక్షణమే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలి..

అనకాపల్లిలో కొంత మంది అధికారులు అధికార పార్టీ తొత్తులుగా వ్యవహరించడం బాధాకరమని, దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆయన జయంతి రోజున జీవీఎంసీ అధికారులు తొలగించడం అన్యాయమని సామాజిక వేత్త బొట్టా చిన్నయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ స్థలాల్లో అనేక చోట్ల అనుమతులు లేకుండా విగ్రహాలు ఉన్నాయని కావాలంటే ఆ విగ్రహాల లిస్టు తాను ఇస్తానన్నారు. వాటిలో ఒక్క విగ్రహాన్ని అయినా తొలగించే ధైర్యం జీవీఎంసీ సిబ్బందికి ఉందా అని ప్రశ్నిస్తున్నానని అన్నారు. ఇటువంటి కక్షపూరిత చర్యలు ప్రశాంతతకు నిలయమైన అనకాపల్లిలో జరగడం బాధాకరమని, ఒక బాధ్యత గల పౌరుడిగా ఈ చర్యలను ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జి. భీమవరంలో అగ్ని ప్రమాదం


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన టిఫిన్ దుకాణం

కశింకోట: మండలంలోని జి. భీమవరంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో చిన్న టిఫిన్ దుకాణం దగ్ధమైంది. సుమారు రూ.50 వేలు ఆస్తి నష్టం జరిగిందని అంచనా. ద్వారపూడి ఆదినారాయణకు చెందిన టిఫిన్ షాపు నుంచి అర్ధరాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగి దుకాణం కాలిపోయింది. పాత్రలు, సామాన్లు దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ప్రమాదంలో నష్టపోయిన తమకు అధికారులు పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు ఆదినారాయణ కోరుతున్నారు.

నేడు దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు

కశింకోట: మండలంలోని తేగాడ గ్రామంలో వెలసిన దత్తాత్రేయ స్వామి ఆలయంలో గురువారం ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రసాద వితరణ చేస్తారన్నారు.

గౌతమ బుద్ధుని ఆశయ సాధనకు కృషి చేయాలి


బుద్ధునితో నా ప్రయాణం పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ బి.వి.సత్యవతి

అనకాపల్లి: గౌతమ బుద్ధుని ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని మాజీ ఎంపీ బి.వి.సత్యవతి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆమె పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 27న విశాఖలోని డాక్టర్ అంబేడ్కర్ భవన్‌లో బుద్ధునితో నా ప్రయాణం అనే నాటకం జరుగుతుందన్నారు. అనకాపల్లి మండలం శంకరం పంచాయతీ బొజ్జన్న కొండను వైఎస్సార్‌సీపీ పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.15 కోట్ల 50 లక్షలతో అభివృద్ధి చేశాయన్నారు. దాంతో పర్యాటకుల తాకిడి పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు వై.హరిబాబు, సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ముచ్చటగొల్పుతున్న ఫొటో ఫ్రేమ్‌లు


కశింకోట బాలికల హైస్కూల్లో ఆకట్టుకుంటున్న ఫొటో ఫ్రేమ్‌లు

కశింకోట: స్థానిక బాలికల హైస్కూల్లో తయారు చేసిన ఫొటో ఫ్రేమ్‌లు విద్యార్థులను ఆకట్టుకుంటున్నాయి. గురువారం జరగనున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం సందర్భంగా విద్యార్థులతో తల్లిదండ్రులు ఫొటోలు తీసుకోవడానికి వీటిని తయారు చేశారు. ఒకేషనల్ ఉపాధ్యాయుడు పి.వి.రమేష్ ఆధ్వర్యంలో ఫ్రేమ్‌లను రంగు కాగితాలు, పువ్వులతో అలంకరించారు.

వెయ్యి ఓట్లు దాటితే అదనపు పోలింగ్ బూత్

నర్సీపట్నం : వెయ్యి ఓట్లు దాటితే అదనంగా పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తామని ఆర్డీవో వి.వి.రమణ పేర్కొన్నారు. ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీవో బుధవారం సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాల్లో తప్పు, ఒప్పులు ఉంటే వాటి సవరణకు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు రాజకీయ పార్టీల నాయకులు యువతను ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏకా శివ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరమణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పచ్చిమేతతో పశువుల్లో అధిక పాల దిగుబడి

కె.కోటపాడు : పశు పోషణలో పశుగ్రాసం రైతులు శాస్త్రీయ పద్ధతిలో సాగు చేయడంతో మంచి దిగుబడిని సాధించవచ్చని కె.కోటపాడు పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు ఈ.దినేష్‌కుమార్ అన్నారు. పశుగ్రాస వారోత్సవాల కార్యక్రమాన్ని పురస్కరించుకొని సింగన్నదొరపాలెం, కె.కోటపాడు గ్రామాల్లో పశుగ్రాసం వల్ల కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు. ఐదు నుంచి ఆరు లీటర్ల పాలు ఇచ్చే పశువులకు దాణాను ఇవ్వకుండా కేవలం పచ్చగడ్డిని ఇవ్వడం ద్వారానే పెంచవచ్చునని తెలిపారు. పచ్చి మేతలతో విటమిన్–ఎ ఎక్కువగా ఉండడం వల్ల పశువులు ఆరోగ్యంగా ఉండడంతో పాటు పాల దిగుబడి పెరగడంతో పాటు సకాలంలో ఎదకు వస్తాయని తెలిపారు. పశుసంవర్థకశాఖ ద్వారా 75 శాతం రాయితీపై అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. పశువైద్య సిబ్బంది మనీషా, ప్రవీణ్ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: పశువులుకు మేలైన పోషణ అందించడానికి మొక్కజొన్న, జొన్న, ఆలసందలు, పిల్లిపెసర వంటివి పెంచుకోవాలని మాడుగుల ఏరియా పశువైద్యశాఖ సహాయ సంచాలకుడు వి.చిట్టినాయుడు అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా కె.జె.పురంలో బుధవారం రైతులకు పంట పొలాల్లో క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. కె. వల్లాపురం పశువైద్యాధికారి శివకుమార్ మాట్లాడుతూ పశువైద్యశాలల ద్వారా కాకిజొన్న విత్తనాలు 5 కిలోలు సబ్సిడీ పోను రూ.115 చెల్లించాలన్నారు. మొక్కజొన్న, జొన్న, ఆలసందల, హైబ్రిడ్ నేపియర్, పిల్లిపెసర వంటి వాటిని పెంచుకోవాలన్నారు.